నమస్తే తెలంగాణ

యాదాద్రి భువనగిరి

I | హైదరాబాద్, శనివారం 15 జూన్ 2024 | YADADRI BHUVANAGIRI

## రామానంద తీర్థలో ఉచిత శిక్షణ

భూదాన్ పోచంపల్లి ,జూన్ 14 : మండల పరిధి జలాల్‌పూర్ గ్రామంలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో మేధా చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నిరుద్యోగ యువతకు ఉపాధి సాంకేతిక శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థలో 6 నెలల కాల పరిమితితో కూడిన ఎలక్ట్రీషియన్ (డొమెస్టిక్), సోలార్ సిస్టం ఇన్‌స్టాలేషన్ సర్వీస్ (ఐటీఐ/డిప్లొమో పాస్), కంప్యూటర్ హార్డ్‌వేర్, సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్, సీసీటీవీ టెక్నీషియన్ (పదో తరగతి పాస్) టైలరింగ్, ఎంబ్రాయిడరీ, జర్దోజి, క్విల్ట్ బ్యాగ్స్ మేకింగ్ (8వ తరగతి పాస్) కోర్సులు ఉంటాయని పేర్కొన్నారు.

అర్హత గల వారు ఒరిజినల్ సర్టిఫికెట్స్, ఆదాయం సర్టిఫికెట్, ఆధార్, జీరాక్స్ సెట్‌తో పాటు పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలతో ఈ నెల 24న ఉదయం 10 గంటలకు రామానంద గ్రామీణ సంస్థలో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. ఉచిత శిక్షణ, హాస్టల్‌లో భోజన వసతితో పాటు ఉద్యోగం కల్పిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 9133908000, 9133908111, 9133908222, 9948466111 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

# కిట్ కట..

## సర్కారు ఆస్పత్రుల్లో కేసీఆర్ కిట్లు బంద్

- మూడు నెలలుగా ఆగిపోయిన వైనం
- ప్రభుత్వం నుంచి సరఫరా కాని కిట్లు
- తల్లీబిడ్డలకు రూ. 15వేల విలువైన వస్తువులు
- జిల్లాలో 300మంది బాలింతలకు పెండింగ్
- ప్రైవేట్‌లో కొనుగోలు చేస్తున్న పరిస్థితి
- పేరుకుపోయిన రూ. 12.14 కోట్ల బకాయిలు

**అమ్మకు ఆసరాగా, బిడ్డకు ఆప్యాయతతో ప్రోత్సాహకాలు అందించేందుకు తీసుకొచ్చిన ఎంసీహెచ్ కిట్ (కేసీఆర్ కిట్) నిలిచిపోయింది. సర్కారు దవాఖానల్లో ప్రసవాలు ప్రోత్సహించి తల్లీబిడ్డలు ఆరోగ్యంగా చూడడానికి చేయూతనిచ్చే పథకం ఆగింది. ప్రసవ సమయంలో ఆసరాగా నిలుస్తుందనుకున్న నగదు అందని ద్రాక్షలా మారింది. జిల్లాలో మూడు నెలలుగా పథకం సక్రమంగా అమలు కావడం లేదు. దాంతో కిట్లను బయట ప్రైవేట్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.**

*– యాదాద్రి భువనగిరి, జూన్ 14 (నమస్తే తెలంగాణ)*


ప్రభుత్వ దవాఖానలో ప్రసవం అయ్యి కేసీఆర్ కిట్ అందుకున్న మహిళ(ఫైల్)

బీఆర్ఎస్ ప్రభుత్వం 2017 జూన్‌లో కేసీఆర్ కిట్ పథకాన్ని తీసుకొచ్చింది. ప్రసవం తర్వాత తల్లీబిడ్డకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలు కల్పించడం, వారు ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవడం దీని ప్రధాన ఉద్దేశం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో బిడ్డలకు జన్మనిచ్చిన మహిళలు ఈ పథకానికి అర్హులు. ఇద్దరికి కంటే ఎక్కువ పిల్లలుంటే దీనికి అనర్హులుగా నిర్ణయించింది. కేసీఆర్ కిట్‌లో తల్లీబిడ్డలకు అవసరమయ్యే సుమారు రూ. 15వేల విలువైన వస్తువులు అందిస్తున్నారు. ఇందులో సబ్బులు, బేబీ ఆయిల్, బేబీ బెడ్, దోమల తెర, డ్రెస్సులు, చీరలు, హ్యాండ్ బ్యాగ్, టవల్, న్యాప్కిన్లు, పౌడర్, డైపర్స్, షాంపు, పిల్లల బొమ్మలు తదితర ఐటెమ్స్ ఉంటాయి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేసీఆర్ కిట్ అనే పేరును తొలగించి, ఎంసీహెచ్ (మదర్ అండ్ చైల్డ్ హెల్త్) కిట్‌గా నామకరణం చేసింది.

### అందని నగదు సాయం..

రాష్ట్ర ప్రభుత్వం కిట్‌తోపాటు ఆర్థిక సాయం కూడా అందిస్తున్నది. ఆడబిడ్డ పుడితే రూ. 13వేలు, మగబిడ్డ పుడితే రూ. 12వేల చొప్పున సాయం చేస్తున్నది. గర్భం దాల్చినప్పటి నుంచి తొమ్మిదో నెల వరకు నాలుగు దశల్లో ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారు. 5–6 నెలల మధ్య పరీక్షల కోసం ప్రభుత్వ దవాఖానకు వచ్చినప్పుడు రూ. 3వేలు, ప్రసవ సమయంలో బాబు జన్మిస్తే రూ. 2వేలు, పాప పుడితే రూ. 5వేలు ఇస్తారు. శిశువుకు మూడున్నర నెలల్లో టీకాలు వేస్తే రూ.2 వేలు, 9నెలల సమయంలో టీకాలు వస్తే రూ. 3వేలు బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు. కానీ కొంత కాలంగా డబ్బులు జమ కావడంలేదు. నిధులు లేమీ కారణంగా అందడంలేదు. జిల్లాలో సుమారు రూ.12.14కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయి.

### కిట్‌తో సర్కారులో పెరిగిన ప్రసవాలు

ఈ పథకంతో మాతా శిశు సంరక్షణలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాయి. పథకం వచ్చిన తర్వాత సర్కారు దవాఖానల్లో ప్రసవాల సంఖ్య పెరిగింది. మాతాశిశు మరణాల సంఖ్య కూడా తగ్గింది. అంతే కాకుండా ప్రైవేట్ ఖర్చు భారం కూడా తగ్గుతున్నది. ప్రస్తుతం ప్రైవేట్ హాస్పిటళ్లకు పోతే అడ్డగోలు బిల్లులు వసూలు చేస్తున్న విషయం అందరికీ తెలిసిందే.

### 300 మందికి పెండింగ్..

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కిట్లు ఎప్పటికప్పుడు పంపిణీ చేసేవారు. ప్రసవం తర్వాత ఎప్పటికప్పుడు ఠంచనుగా ఇచ్చేవారు. ఈ నేపథ్యంలో దేశ వ్యాప్తంగా ఈ పథకానికి మంచి గుర్తింపు లభించింది. కానీ ప్రస్తుతం కిట్ల కొరత వేధిస్తున్నది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కిట్లు అందుబాటులో లేవు. గర్భిణుల నమోదు పెరుగుతున్నా మూడు నెలలుగా కిట్లు అందడంలేదు. ప్రభుత్వం నుంచి సరఫరా కావడంలేదని అధికారులు చెబుతున్నారు. సుమారు 300మందికి కిట్లు అందించాల్సి ఉంది. ప్రసవం అయిన వెంటనే కిట్లు ఇవ్వకపోవడంతో బాలింతలు, శిశువుల కోసం బయట మార్కెట్‌లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### బిడ్డ పుట్టి మూడు రోజులైనా కిట్టు ఇయ్యలే



సంవత్సరం క్రితం చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పు అయిన రోజే బిడ్డ రక్షణ కోసం కేసీఆర్ కిట్టు అడుగక ముందే ఆసుపత్రి వాళ్లు ఇచ్చిండ్రు. ఇప్పుడు అప్పటిలాగా లేదు. ఇప్పుడు ఇదే ప్రభుత్వ ఆసుపత్రిలో నా కూతురు కాన్పు అయ్యి మూడు రోజులు అవుతున్నది. ఇంకా కిట్ ఇవ్వడం లేదు. మేమే మందుల షాపులో కొనుకొచ్చుకున్నాం. అప్పుడు బిడ్డ పుట్టిన రోజే అవసరమైన అన్నీ కిట్టులో పెట్టి ఇచ్చేవారు. అప్పుడు చాలా బాగుండే. ఇప్పుడు ఏమీ లేవు. ఇస్తరో లేదో కూడా తెల్వదు.

– సికినంమెట్ల లక్ష్మమ్మ, చౌటుప్పల్


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంత జెండగే

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ హనుమంతు జెండగే

భువనగిరి కలెక్టరేట్, జూన్ 14 : సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతు కె. జెండగే వైద్యాధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం వైద్యాధికారులు, ఎంపీడీఓలు, మండల పంచాయతీ అధికారులతో ఆయన సమావేశమై సీజనల్ వ్యాధుల ముందస్తు జాగ్రత్తలపై సమీక్షించారు. వర్షాకాలం మొదలైనందున అన్ని గ్రామాల్లో నీటి నిల్వలు ఏర్పడే అవకాశమున్నదని, దోమలు వ్యాప్తి చెందకుండా నివారణ కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

ఇంటి చుట్టుపక్కల నీటి గుంటలు లేకుండా చూడాలని తెలిపారు. ఆశ, ఏఎన్ఎంలు ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి పెట్టేలే సిబ్బందికి తెలియజేయాలన్నారు. గ్రామాల్లో నీటి నిల్వలు ఉన్న గుంటలలో ఆయిల్ బాల్స్ వేసి దోమలు పుట్టకుండా చూడాలని చెప్పారు. డయేరియా రాకుండా కాచి చల్లార్చిన నీటిని తాగేలా ప్రజలకు అవగాహన కలిగించాలని, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పాము, కుక్క కాటు తదితర వాటికి కావలసిన మందులను నిల్వ ఉంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. గత మూడు సంవత్సరాల్లో ప్రత్యే ఆరోగ్య సమస్యలు వచ్చిన గ్రామాలపై నిఘా పెట్టాలన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ఆశ్రమ పాఠశాల, పాఠశాలలు సందర్శించి వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. వర్షాకాలంలో గర్భిణులు ఇబ్బంది పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ నెల 20న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 1 నుంచి 19 ఏండ్ల వయస్సు వారికి ఆల్బెండజోల్ మాత్రలు వేయాలని, అందుకు తగిన ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో 1,57,496 మందికి పిల్లలకు ఈ మాత్రలు వేయాలని, 1 నుంచి 2 సంవత్సరాల మధ్య చిన్నారులకు సగం మాత్ర పొడిచేసి పాలు లేదా నీటిలో కలిపి తాగించాలని, 3 నుంచి 19 సంవత్సరాల వారికి ఒక మాత్ర మింగించాలని చెప్పారు. జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి పాపారావు మాట్లాడుతూ నీటి సంబంధిత వ్యాధులు, కీటక జనిత వ్యాధులు, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అనుబంధ శాఖల సమన్వయంతో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రాపిడ్ రెస్పాన్స్ టీమును ఏర్పాటు చేసి, వారి మొబైల్ నంబర్‌ను ప్రతి గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గంగాధర్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి ఎన్. శోభారాణి, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎంఎ కృష్ణన్, జిల్లా పంచాయతీ అధికారి సునంద, ఉప జిల్లా వైద్యాధికారులు శిల్పిని, యశోద, ప్రోగ్రాం అధికారులు రామకృష్ణ, సుమన్‌కళ్యాణ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

### అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, మిషన్ భగీరథ ఇంటింటి సర్వే పనులు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంత్ జెండగే అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం మండల స్పెషల్ ఆఫీసర్లు, మండల అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి పాఠశాలకు పనుల వారీగా ఫైల్స్ ఏర్పాటు చేసుకోవాలని, పనులు పూర్తయిన చోట ఎంపీడీఓలు పరిశీలించి సంబంధిత బడ్జెట్ రిలీజ్ చేయాలన్నారు. పనులు పూర్తయిన పాఠశాలల్లో పెయింటింగ్ పనుల కోసం వివరాలు పంపాలని తెలిపారు. మిషన్ భగీరథ ఇంటింటి సర్వే వేగంగా జరుగాలని, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. ఇంటింటి సర్వే వివరాలను పంచాయతీ సెక్రటరీల ద్వారా యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు.


సమావేశంలో పాల్గొన్న వైద్యాధికారులు, ఎంపీడీఓలు

## శాస్త్రోక్తంగా లక్ష్మీనృసింహుడికి నిత్యారాధనలు


స్వామివారికి నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూన్ 14 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి నిత్యారాధనలు శాస్త్రోక్తంగా జరిగాయి. శుక్రవారం తెల్లవారు జామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో నారసింహుడిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు స్వామి, అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్లకు నిత్య తిరుకల్యాణోత్సవం జరిపించారు. సాయంత్రం స్వామివారికి తిరువీధి, దర్బార్ సేవలు చేపట్టారు. అమ్మవారికి ఊంజల్ సేవ వైభవంగా సాగింది. రాత్రి స్వామివారికి తిరువారాధన చేపట్టి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన జరిపారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు జరిగాయి. సుమారు 20 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలు కలిపి ఆలయ ఖజానాకు రూ.42,04,074 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.


కొండమడుగు ప్రభుత్వ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసంలో పాల్గొన్న ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

## ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతాం

- ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

బీబీనగర్, జూన్ 14 : ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, అన్నారు. మండలంలోని కొండమడుగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ప్రొఫెసర్ జయశంకర్ బడిబాటలో భాగంగా సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్‌కుమార్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకే ప్రభుత్వం బడిబాట కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులను విద్యార్థులు, తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించాలన్నారు. విద్యార్థుల భవిష్యత్ ఉపాధ్యాయుల చేతుల్లోనే ఉందని, ప్రత్యేక శ్రద్ధతో పని చేసి వారిని భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ యర్కల సుధాకర్‌గౌడ్, జడ్పీటీసీ గోలి ప్రణీతాపింగళ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, డీఈఓ నారాయణరెడ్డి, డీఆర్‌డీఓ కృష్ణన్, స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి కొండమడుగులో నిర్వహించిన పెద్దమ్మ కల్యాణ మహోత్సవానికి హాజరై పూజలు చేశారు. బీబీనగర్‌లోని పెద్ద చెరువును పరిశీలించి చెరువు అభివృద్ధిపై సమీక్షించారు.


చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

## ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చాలి

- చౌటుప్పల్‌లో భూ నిర్వాసితుల ధర్నా

చౌటుప్పల్, జూన్ 14 : ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మార్చి తమకు న్యాయం చేయాలని పలు గ్రామాల భూ నిర్వాసితులు శుక్రవారం చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. చిన్న కొండూర్ రెవెన్యూ పరిధిలోని తూర్పుగూడెం, మందోళ్లగూడెం, సంగారాయి చెర్వు, లింగారెడ్డిగూడెం తదితర గ్రామాల రైతులు ధర్నాలో పాల్గొని ఆర్డీఓ వి.శేఖర్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఎన్నో ఏండ్లుగా వారసత్వంగా వచ్చిన భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, అలాంటి భూములు పోతే రోడ్డున పడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం పునరాలోచన చేసి అలైన్‌మెంట్ మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు బూర్గు కృష్ణారెడ్డి, గంగాదేవి సైదులు, బోరెం నర్సిరెడ్డి, చీరిక సంజీవరెడ్డి, బోరెం ధర్మేందర్ రెడ్డి, బోరెం ప్రకాశ్ రెడ్డి, బోరెం శ్రీనివాస్ రెడ్డి, జంగారెడ్డి, పద్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, రాకేశ్, నర్సింహ, యాదయ్య పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ రవి

## పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షను పారదర్శకంగా నిర్వహించాలి

- ఎంజీయూ రిజిస్ట్రార్ అల్వాల రవి

నల్లగొండ, జూన్ 14 : మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలో మొట్ట మొదటి పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని యూనివర్సిటీ రిజిస్ట్రార్ అల్వాల రవి సూచించారు. శుక్రవారం ఎంజీయూలో నిర్వహించిన పరీక్షల సన్నాహక సమావేశంలో రిజిస్ట్రార్ పాల్గొని పలు సూచనలు చేశారు. విశ్వవిద్యాలయం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ ప్రవేశ పరీక్షను అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. పరీక్ష మొదటి విడుతగా శనివారం ఉదయం 10:30 నుంచి 11:30 వరకు అన్ని సబ్జెక్ట్‌ల అభ్యర్థులకు రిసర్చ్ మెథడాలజీ పరీక్ష, రెండో విడుతలో మధ్యాహ్నం 12 నుంచి ఒంటిగంట వరకు బిజినెస్ మేనేజ్మెంట్, కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ అభ్యర్థులకు, 2 నుంచి 3 గంటల వరకు కామర్స్, బయో కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేటిక్స్ అభ్యర్థులకు, 3:30 నుంచి 4:30 గంటల వరకు గణితం అభ్యర్థులకు పరీక్ష నిర్వహించాలని సూచించారు. సీఈఓ డాక్టర్ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ మొత్తం 399 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. అభ్యర్థులు యూనివర్సిటీ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు పొందాలని సూచించారు. నిర్ణీత సమయం కంటే ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని పేర్కొన్నారు. సమావేశంలో ఓఎస్‌డీ అంజిరెడ్డి, డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ ఆకుల రవి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె. అరుణ ప్రియ పాల్గొన్నారు.

## రద్దీ ప్రాంతాల్లో సెల్‌ఫోన్ల చోరీ

- నలుగురు దొంగల అరెస్ట్

చౌటుప్పల్ రూరల్, జూన్ 14 : మండలంలోని ధర్మోజిగూడెం వద్ద శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా నలుగురు సెల్‌ఫోన్ల చోరీ దొంగలను చౌటుప్పల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా తుర్కనాయుడువలసకు చెందిన గొర్ల శివ, అంబటి శ్రీను, హైదరాబాద్ కర్మాన్‌ఘాట్‌కు చెందిన మేకల క్రాంతి, ఒడిశాకు చెందిన అమ్మేరి గణేశ్ మారుతి స్విఫ్ట్ (ఏపీ28డీఎల్ 6899)కారులో తిరుగుతూ దారి వెంట రద్దీగా ఉండే ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నెల రెండో తారీఖున చౌటుప్పల్ బస్టాండ్ వద్ద రద్దీగా ఉన్న బస్సులో సెల్‌ఫోన్ చోరీ చేసి ఫోన్ పే ద్వారా డబ్బులు బదిలీ చేస్తుండటంతో పోలీసులు లోకేషన్ ఆధారంగా ధర్మోజిగూడెం వద్ద పట్టుబడ్డారు. నిందితులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు చౌటుప్పల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు.

## అడిగిన దానికి సమాధానం చెప్పండి..
# లేదంటే సెలవు పెట్టి వెళ్లిపోండి

- అధికారులపై ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఫైర్
- మహిళా ఉద్యోగి మీదికి పేపర్లు విసిరికొట్టిన కోమటిరెడ్డి


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్, జూన్ 14 : పలు అభివృద్ధి పనులను పరిశీలించడానికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి శుక్రవారం చౌటుప్పల్ పట్టణానికి వచ్చారు. వివిధ శాఖల అధికారులతో సమీక్షించి డ్రైనేజీ, సీసీరోడ్డు పనులు, బిల్లుల రికార్డుల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన అధికారులపై దురుసుగా ప్రవర్తించారు. ఇప్పటి వరకు రూ.12 కోట్ల అగ్రిమెం ట్ వ్యాల్యూలో గ్రాస్ ఎంత బుక్ అయ్యింది, దానిపై క్లారిటీ ఇవ్వాలని మున్సిపల్ శాఖ ఇంజినీరింగ్ అధికారులపై ఫైర్ అయ్యారు. ఆయన మాట్లాడుతుండగా ఓ మహిళా ఉద్యోగి పేపర్‌పై ఏదో రాస్తుండటంతో కోపోద్రిక్తుడైన ఎమ్మెల్యే ఆమెపై పేపర్లు విసిరారు. 'నేను అడిగిన దానికి సమాధానం చెప్పరేం.. నాలెడ్జ్ ఉందా? ఉంటే పని చేయండి.. లేకపోతే లీవ్ పెట్టి వెళ్లిపోండి' అని మండిపడ్డారు. 'మీరు చెప్పింది వినటానికి నేను రాలేదు.. నేను అడిగిన దానికి సమాధానం చెప్పాలి' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓ మహిళా అధికారిని అని కూడా చూడకుండా ఇలా ప్రవర్తించడం సమజసం కాదని ఎమ్మెల్యే తీరును పలువురు ఖండించారు.



విజేతలకు బహుమతి ప్రదానం చేస్తున్న అధికారులు

## కబడ్డీలో నల్లగొండ జట్టు విజేత

- ముగిసిన విద్యుత్ ఉద్యోగుల క్రీడలు

బొడ్రాయిబజార్, జూన్ 14 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రెండు రోజులుగా జరిగిన తెలంగాణ రాష్ట్ర ఇంటర్ సర్కిల్ విద్యుత్ ఉద్యోగుల క్రీడలు శుక్రవారం ముగిశాయి. కబడ్డీలో మొదటి బహుమతి నల్లగొండ ఆపరేషన్ సర్కిల్, ద్వితీయ బహుమతి మహబుబ్‌నగర్ ఆపరేషన్ సర్కిల్, తృతీయ బహుమతి వరంగల్ సర్కిల్ గెలుచుకున్నాయి. క్రీడల్లో గెలుపొందిన విజేతలకు అధికారులు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట ఎస్ఈ సీహెచ్ పాల్‌రాజ్, ఆపరేషన్ డీఈలు శ్రీనివాస్, వెంకటకృష్ణయ్య, డీఈ టెక్నికల్ దాలినాయుడు, నల్లగొండ జిల్లా స్పోర్ట్స్ సెక్రటరీ శ్రీనివాస్, స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్, తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ 1104 ప్రాంతీయ అధ్యక్షుడు నేతకాని వెంకన్న, టీఆర్‌వీకే మల్లికార్జున్, 327 దశరథ రెడ్డి, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.